International Journal of Enhanced Research in Educational Development (IJERED)
ISSN: 2320-8708, Vol. 11 Issue 5, Sept.-Oct.-2023, Impact Factor: 7.326

# వేమన పద్యాలు - సామాజిక చైతన్య గీతాలు : ఒక పరిశీలన

Dr. K. Lakshmi Narayana

Assistant Professor In Telugu, K. T. S Govt Degree College,
Rayadurg Anantapur Dist

## పరిచయం

తెలుగు సాహిత్య చరిత్రలో వేమన ప్రజాకవి. సమాజములో మనిషిని నడిపించే కవిగా, సమాజాన్ని గెలిపించే చైతన్య మూర్తిగా మూఢ నమ్మకాలపై తిరుగు బాటు చేయడమే గాక, సర్వ మానవ కళ్యానికి పందిళ్ళు వేసిన మహాయోగి మన వేమన. ప్రజలు ఉపయోగించే సహజమైన భాషలో నిత్యసత్యముల గురించి, కొంచెం నిష్టూరముగనైనా ఆటవెలది పద్యముల్లో అందరికీ, చివరకు చదువుకోని వారికి కూడా అర్థమయ్యే రీతిలో రచన కొనసాగించినాడు కాబట్టే ప్రజాకవియైనాడు.

వేమన పద్యాలు వందల సంవత్సరాల వరకు గ్రంథస్థం కాలేదు. కేవలం సామాన్యుల నాల్కలపైనే నడయాడుతూ వచ్చాయి. 1731లో ఫాదర్ లెగాక్ తొలిసారిగా వేమన పద్యాలు సేకరించాడని పరిశోధకుల భావన. 1816 లో ఒక ఫ్రెంచి మిషనరీ, తర్వాత ఛార్లెస్ ఫిలిఫ్ బ్రౌన్ లు వేమన పద్యాలెన్నింటినో సేకరించి వాటిని లాటిన్, ఇంగ్లీష్ భాషల్లోకి అనువదించారు. అలాగే హెన్నీ బ్లూ చాంస్ (1897), విలియమ్ హోవర్డ్ కాం బెల్ (1920), జీ.యూ పోప్, సీ.ఈ గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు వేమనను లోకకవిగా కీర్తించారు.

'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మాట వినని తెలుగువారు ఉండరు. వానకు తడవనివారు, ఒక వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరని లోకోక్తి. తెలుగువారికి ఎంతో సారస్వత సేవ చేసిన బ్రిటిష్ అధికారి సీపీ బ్రౌన్ తోనే వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయి. పామరులకు కూడా అర్థమయ్యేలా పద్యాలు చెప్పి మెప్పించిన కవి వేమన. ఆటవెలదిలో అద్భుతమైన కవిత్వం, అనంత విలువలు గల సలహాలు, సూచనలు, తెలుగు సంగతులు ఇమిడ్చిన మహానుభావుడు వేమన. యవ్వనంలో వేశ్యాలోలుడిగా వ్యవహరించినా, కొంతకాలానికి విరక్తి చెంది, తపస్సు చేసి యోగిగా మారారు. సమాజానికి హితబోధ చేస్తూ వేలాది పద్యాలు చెప్పారు. చివరకు కడప దగ్గరి పామూరు కొండ గుహలో శార్వరి నామ సంవత్సరం శ్రీరామనవమి నాడు సమాధి చెందారు. కదిరి తాలూకా కటారు పల్లెలోని వేమన సమాధి ప్రసిద్ధి చెందినది. వేమన జీవితకాలం 1652-1730 గా పరిశోధకులు పేర్కొన్నారు.

తెలుగువారిలో వేమన కీర్తిని అజరామరం చేయటానికి కృషి చేసినవారు కట్టమంచి రామలింగారెడ్డి. రాష్ట్రంలో పలుచోట్ల వేమన జయంతి ఉత్సవాలు, సంఘాల ఏర్పాటును సాధించారు. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, వేటూరి ప్రభాకర శాస్త్రి వేమనను సంస్కర్తగా ప్రస్తుతించారు. ఆరుద్ర 'మన వేమన' పుస్తకాన్ని రచించారు. డాక్టర్ ఎస్.గోపి, బంగోరె వంటి కవులు, రచయితలు వేమన రచనలపై పరిశోధనలు చేశారు. ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావుచే కేంద్ర సాహిత్య అకాడమీ, వేమన జీవిత చరిత్రను రాయించి 14 భాషల్లోకి అనువదింపజేసింది. ఆంగ్ల, ఐరోపా భాషలన్నింటిలోకి, అన్ని ద్రావిడ భాషల్లోకి వేమన పద్యాలు అనువాదమయ్యాయి.

వేమనకు లభించిన గౌరవం మరే తెలుగు కవికీ లభించలేదు. ఐక్యరాజ్యసమితి-యునెస్కో విభాగం, ప్రపంచ భాషా కవుల్లో గొప్పవారిని ఎంపిక చేసే సందర్భంలో వేమనను ఎన్నుకుని, ఆ రచనలను పలు భాషల్లోకి అనువదింపజేశారు. వేమన జీవిచరిత్ర, యోగి వేమన (1947), యోగి వేమన (1988), శ్రీవేమన చరిత్ర (1986) పేర్లతో సినిమాలుగా ప్రజలను ఆలరించాయి. పౌరాణిక నటుడు గుమ్మడి గోపాలకృష్ణ రూపొందించిన 'యోగి వేమన' సీరియల్ టీవీ ఛానల్లో ప్రసారమైంది. ఇంతటి కీర్తిని పొందిన వేమన జయంతికి పొరుగునున్న కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఏటా తగిన నిధులను కేటాయిస్తూ, తాలూకా, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తోంది. మైసూర్ మహారాజ సంస్థాన్ ఏనాడో వేమన ప్రాశస్త్యాన్ని గుర్తించింది. తెలుగు రాష్ట్రాల్లో వేమనకు, ఆయన సాహిత్యానికి తగిన ప్రచారం, గౌరవాన్ని కల్పించటం లేదనేది నిష్ఠురసత్యం.

**లక్ష్యాలు:**

1. వేమన పద్యాలలో నీతి, లోకజ్ఞానం మానవత విలువలను విశ్లేషించుట.
2. వేమన పద్యాలలో విద్య ప్రాధాన్యత అంశాల విశ్లేషణ.

3. యోగి వేమన పద్యాలలో ' మానవ ప్రవర్తన' అంశాలపై విశదీకరించుట.

**ఆవశ్యకత:**
తెలుగు శతక సాహిత్యానికి కవితా ప్రామాణికతను, చారిత్రిక పరిపుష్టిని కలిగించిన రచనల్లో వేమన పద్యాలు ప్రముఖ పాత్ర వహిస్తాయనడం అతిశయోక్తి కాదు. వేమన సంపన్నమైన రెడ్డి, కాపు కులంలో జన్మించి సంసారంలో అనేక ఒడిదుడుకులకు లోనై ఆనాడు సమాజంలో అస్తవ్యస్తంగా ఉన్న వివిధ మత సాంఘికాది విషమ పరిస్థితులకు సంక్షుభిత మనస్కుడై కాలక్రమంలో విరక్తచిత్తుడై సంసారం త్యజించి యోగియై, తత్వజ్ఞానం పొంది దేశం నలుమూలల సంచరించి తన అనుభవాన్ని, నమ్మకాన్ని నిర్మొహమాటంగా, సూటిగా తేట తెలుగు మాటలలో ప్రజలకు బోధించారు. వీరి బోధనలు ఆట వెలదులై, తేట గీతులై తెలుగు భాషా సాహిత్యంలో ఆణిముత్యాల హారాలై అలరించాయి.

వేమన పద్యాలు సామాజిక చైతన్యానికి నాంది వేసాయి. సామాజిక చైతన్యం ఆ పద్యాల లక్షణం. సమాజంలో నెలకొని ఉన్న అన్ని అంశాలలో వేమన సృజించని అంశమే లేదు. అన్ని సమస్యలను భిన్న కోణాల్లోంచి దర్శించి, ఆ దర్శన వైశిష్ట్యాన్ని తన పద్యాలలో వివరించారు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట దోపిడీలను ఎలుగెత్తడమే కాకుండా విగ్రహారాధనను నిరసించారు. కుహనగురువులు, దొంగ సన్యాసుల దోపిడీలు వ్యక్తిత్వ వికాసంపై, విద్యపై, సామాజిక రుగ్మతలపై వేమన తన పద్యాలలో భావాన్ని కూడా సరళమైన భాషలో చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పాడు. సాధారణంగా వేమన తన పద్యంలో మొదటి రెండు పాదాల్లోనూ నీతిని ప్రతిపాదించి మూడో పాదంలో దానికి తగిన సామ్యం చూపాడు. ఈ పరిశోధనా వ్యాసంలో యోగి వేమన ఆట వెలది పద్యాలు మానవ ప్రవర్తనను విశదీకరించడం లోనూ, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం లోనూ వేమన పద్యాల పాత్రను గురించి తెలుసుకుందాం.

సమాజ స్థితిగతుల పట్ల, మూఢాచార మత ఛాందసాల పట్ల మన లోలోపల కుతకుతలాడే భావాలకు, తిరుగుబాటుతనానికి ఓ రూపాన్నిస్తే అదే యోగి వేమన. ఆయన మనలోని అపరిచితుడైన తిరుగుబాటు దారుడు, జాతికి నూతన వ్యక్తిత్వాన్ని ప్రసాదించిన సాధకుడు, బోధకుడు, యోగి! తెలుగు భాషకు ఖండాంతర ఖ్యాతిని ఆర్జించి పెట్టిన సుప్రసిద్ధ కవి. వేమన పద్యాలు జన వ్యవహార శైలిలో తేలికైన ఉపమానాలతో పద్యాలు లోకజ్ఞానం కలిగిస్తాయి. వేమన పద్యాలలో ప్రతి పద్యం ఒక ప్రత్యేక భావాన్ని ప్రకటిస్తుంది. మానవ జీవితాన్ని మహోన్నతంగా మలచగల శక్తి వేమన శతక పద్యాలకున్నది. వేమన చెప్పిన పద్యాల భావాలను జీవితంలో పాటించగలిగితే సమాజంలో అన్యాయాలు, అధర్మాలు, దోపిడీలు, హింసలు ఉండవు.

విద్యలేనివాడు విద్వాంసు చేరువ
నుండగానే పండితుండుగాడు
కొలని హంసలకడ గొక్కెరలున్నట్లు
విశ్వదాభిరామ వినురవేమ !

విద్యలేని వాడు విద్యాంసుల దగ్గర ఉన్నంత మాత్రాన వాడు ఎప్పటికీ విద్యాంసుడు కాలేడు. సరోవరంలోని రాజహంసల సమూహంలో కొంగ ఉన్నంతమాత్రాన అది రాజహంస అవుతుందా? కొంగ కొంగే - హంస హంసే. విద్య ఐశ్వర్యంలో ఆభరణం వంటిది. దారిద్ర్యంలో ఆశ్రయం వంటిది. విద్య గుప్తధనం లాంటిది. చదవడానికి మించిన మించిన చౌకైన వినోదం గాని, కలకాలం నిలిచిపోయే ఆనందంగాని మరొకటి లేదు. విద్య వల్ల, సదాచారము వల్ల సంస్కారాభివృద్ధి జరిగి, మానవుడు సజ్జనుడై సంఘ శ్రేయోభిలాషి యగును. ఉన్నత ఆశయం, అవిరళకృషి, ధృఢ సంకల్పం, సరైన ప్రణాళిక, సహనం, స్థైర్యము, త్యాగం, దీక్షాదక్షతలు అకుంఠిత పరిశ్రమ లక్ష్య సాధనకు అవసరమని గ్రహిస్తాడు. విషం తన ప్రభావాన్ని ఒక్కసారే చూపుతుంది. కాని ఒక చెడ్డ పుస్తకం చాలాకాలం వరకు మనుషుల మనసులను విషమయం చేస్తూనే ఉంటుంది. నిద్రాణావస్థలోనున్న సమాజాన్ని మేల్కొలిపే విషయాలను మానవతావాది వేమన పద్యాలు మనకు ఇలా గుర్తు చేస్తాయి.

చదువు చదువుకున్న సౌఖ్యం బిలను లేదు
చదువు చదివేనేని సరసుడౌను
చదువు మర్మమెరిగి చదివిన చదువురా
విశ్వధాభిరామ వినురవేమ!

చదువు లేని వారికి సౌఖ్యం లభించదు చదువుతున్న వాడే సరసుడు. చదువు కోవాలనే అభిలాష గలవాడు విద్యలలోని సారాన్ని, మర్మాన్ని గ్రహించడానికి చదవాలి గానీ వృథా పఠనము వలన ప్రయోజనం లేదు. నేడు నీతిమంతులైన విద్యావంతులు కావాలి. శీలాన్ని పెంచే విద్య నేర్వాలి. సత్ప్రవర్తన కలిగిన పౌరులై సమ సమాజం కోసం పాటు పడాలి. శీలముతో కూడిన విద్యను గడించిన వారు సదా పరుల ధన, మాన, ప్రాణాలను కాపాడుటకు ప్రయత్నిస్తుంటారు. ఇటువంటి విద్య వలననే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు మహామనిషి కాగలిగెను.

సాధనంబు లేక సమకూరదేదియు
బోధలేని విద్య పొందదెపుడు
పొదు కొల్పి మదిని భావించి చూడరా
విశ్వదాభిరామ వినురవేమ!

అభ్యాసము కూసు విద్య. అలాగే సాధనమున పనులు సమకూరును. గురు బోధలేని విద్య లాభించదు. మనస్సునందు దేవుని నిల్పి ధ్యానించు వాడే యోగ్యుడు.

చదువు చదువనేల? సన్యాసి కానేల?
షణ్మతముల జిక్కి చావనేల?
అతను భజన చేసి యాత్మలోఁ దెలియుడి
విశ్వదాభి రామ వినుర వేమ!

చదువులన్నీ చదివి వేదాంతియై సన్యాసిగా శ్రమపడుట కంటే నిరాకార భగవంతుని సేవించి ఆత్మ జ్ఞానియై ముక్తి పొందుట మేలు.

ఆర్యులైన ఘనులు కార్యహీనులు కారు
శౌర్య ధైర్యములను సంతరించి
పూర్ణ భావ మరియ బొందుచునుందురు
విశ్వదాభిరామ వినుర వేమ!

విజ్ఞానులు తమకాలమును వ్యర్థముగా వెళ్ళబుచ్చక ధైర్య సాహసములతో సంపూర్ణ జ్ఞానమును పొందుదురు.

గురువు తానయినను హరుని తాజూపును
బ్రహ్మ లోకమితడు పారజూపు
శిష్య నరసి తట్టి చీకటి బాపురా
విశ్వదాభిరామ వినురవేమ.

నిజమైన గురువు శిష్యునికి బ్రహ్మలోకమును, శ్రీహరిని కూడా చూపించగలడు. శిష్యుని భుజం తట్టి ధైర్య సాహసములను నేర్పుతూ అతని అజ్ఞానాంధకారమును తొలగించును.

తన జీవితమే వేమనకు పరమ గురువు. జీవితం సత్యాన్ని మౌనంగా వ్యాఖ్యానిస్తుందే తప్ప, వితర్కాల జోలికి పోదు. జీవితానికి మొహమాటాలు లేవు. ఎంతో ఔదార్యంతో వరాలను అనుగ్రహించే జీవితం అంతే నిర్దాక్షిణ్యంగా శాపాలనూ ఇస్తుంది. వేమనకు తన జీవితం నేర్పిన గొప్ప గుణపాఠమిది. రక్తిమార్గంలో పడి ఐహిక భోగాల్లో మునిగితేలిన ఆయన జీవితం... మలుపు తిరిగి విరక్తి బాట పట్టిందంటే, దానికి కారణం... ఆ గుణపాఠమే! తన స్వయంకృషితో సత్యాన్ని స్వాయత్తం చేసుకొన్న వేమన- ఆత్మశోధనతో, సాధనతో తనకు తాను శిష్యుడయ్యాడు. లోకానికి గురువయ్యాడు. అందువల్లే ఆయన ప్రవృత్తిలోని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు- ఆయన భావాల్లో, భాషలో స్వచ్ఛంగా, ధారాళంగా ప్రవహించాయి. లోకాన్ని మెప్పించాయి.

**వేదాంతసారం సులభంగా...**

విన్నది విన్నట్లుగా, కన్నది కన్నట్లుగా కొట్టినట్లు వేమన చెప్పుకొంటూ పోయినా- ఆ పలుకుల్లోని నిర్మొహమాటం, నిజాయితీ మనల్ని కట్టిపడేస్తాయి. వేమన పెద్ద పండితుడు కాదు కాబట్టి ఆయన పలుకులను క్లిష్టతకు బదులు, ప్రవక్తల తరహా స్పష్టత వరించింది. దానికి హాస్యప్రవృత్తి జతకలిసింది. చివరకు వేమన్నవాదం- ఆధునిక వేదంగా రూపొందింది. జనానికి మోదాన్ని అందించింది. ఆయనను ప్రజాకవిని చేసింది. వేమన కవిత్వమంతా ఆయనలోని యోగికి భోగికి మధ్య జరిగిన సంవాద, సంఘర్షణలే. చిరకాల సాధన, సంఘర్షణల దరిమిలా వేమన ఎదలో తత్త్వం వెలుగుచూసింది. సత్యం అనుభవమైంది. అది లోకానికి హితబోధ చేయాలని సంకల్పించింది. తేట తెలుగులో వేలాదిగా ఆటవెలది పద్యాలను ఆశువుగా అందించింది.

మొదటి రెండు పద్య పాదాల్లో సూక్తిని చెబుతూ దానికి మూడోపాదంలో ఒక పోలికను జతచేసి, 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో ముగించడం వేమన శైలి. 'అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను, సజ్జనుండు పల్కు చల్లగాను' అంటూ తాను చెప్పదలచుకున్న సూక్తికి 'కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా?' అనే ఒక సుపరిచిత సామ్యాన్ని అనుసంధానించడం ద్వారా పద్యానికి నైశిత్యం చేకూర్చిన ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. ఈ క్రమంలో కొండ అద్దమందు కొంచమై ఉండదా. బొగ్గు పాలకడగ పోవునా మలినంబు; చిత్తశుద్ధిలేని శివపూజలేలరా' వంటి ఎన్నో వాక్యాలు లోకోక్తులుగా స్థిరపడ్డాయి. చాలా క్లిష్టమైన వేదాంతసారాన్ని సైతం అలవోకగా, క్లుప్తంగా తేలిక మాటల్లో చెప్పడం వేమన ప్రత్యేకత. 'వ్రాత వెంటగాని వరమీదు దైవంబు...

చేతకొలదిగాని వ్రాతకాదు... వ్రాతకు అజుడు కర్త! చేతకు తా కర్త' అనే పద్యం- భారతీయ ప్రారబ్ధవాదానికి, కర్మసిద్ధాంతానికి సులభ సుందరమైన వ్యాఖ్యానం. 'పసుల వన్నె వేరు పాలెల్ల ఒక్కటి... పుష్పజాతి వేరు పూజ ఒకటి... దర్శనంబులు ఆరు- దైవమదొక్కటి పద్యం భిన్నత్వంలో ఏకత్వాన్ని అవలీలగా ప్రతిపాదించింది. సమతాభావాన్ని సరళంగా ప్రకటించింది.

ప్రపంచంలో వేమనను మించిన చతురవచోనిధి లేడు. ఆయన 'సహజకవి' అన్నారు కట్టమంచి రామలింగారెడ్డి. 'వేమన వెలువరించిన సత్యాలు మతాల ఆవరణల్లో పుట్టినవి కావు, శ్రామిక జనుల ప్రేమపూరిత హృదయ కుహరాల్లోంచి ఉబికి వచ్చిన శాశ్వత సత్యాలవి' అన్నారు పాశ్చాత్యులు. వేమన రచనలకు ఆకర్షితుడైన తొలి పాశ్చాత్యుడు- జే.ఎ.దూబాయ్ అనే ఫ్రెంచి మతగురువు. 1816లో దూబాయ్ ఫ్రెంచి భాషలోకి అనువదించిన వేమన పద్యాలు దరిమిలా ఆంగ్లంలోకి తర్జుమా అయ్యాయి. 'వేమన నా కవి.. ఆయనను నేనే కనుగొన్నాను' అని ప్రకటించుకొన్న చార్లెస్ ఫిలిప్ బ్రౌను దేశం నలుచెరగులా పరిశోధించి వేమన పద్యాలు సేకరించి 1824లో రెండువేల పద్యాలు అచ్చువేయించాడు. వాటిని ఆంగ్లంలోకి, లాటిన్ లోకి బ్రౌనే అనువదించాడు.

## చరిత్రలో స్థిర స్థానం

"ఊరు కొండవీడు, ఉనికి పశ్చిమ వీధి, మూగచింతపల్లె మొదటి ఇల్లు' అంటూ తన చిరునామాను సూచించిన వేమన రచ్చ గెలిచి, 1947లో వెండితెరకు ఎక్కాడు టీవీలో ధారావాహికగానూ మెరిశాడు. 'తెలిసి చెప్పిన మాట తేటగానుండును' అని గ్రహించినవాడు, ప్రకటించినవాడు- వేమన. ఆత్మతత్త్వాన్ని అవగాహన చేసుకొని సత్యాన్ని సాధికారికంగా వెల్లడించిన కవిగా వేమన చరిత్రలో నిలిచిపోయాడు. 'వేమన అనగ యోగి! వెలసె లోకములోన... పూజలిడుడు పుణ్య పురుషులార! పూజ లిడినయంత భుక్తి ముక్తుల నొసగు" అని అభయమొసగిన విశ్వదాభిరాముడి పలుకులను లోకం విశ్వసించింది. వేమనను కవిగానే కాక తత్త్వ గురువుగానూ గుర్తించింది. గుండెల్లో స్థానం ఇచ్చింది.

## ముగింపు:

ఆచారాన్ని, తత్వాన్ని బట్టి చూస్తే వేమనకు ఏ జాతీ లేదు. జాతి, మత, సాంఘికాది భేదాలను వేమన తీవ్రంగా ఖండించారు. అన్యాయాన్ని, మోసాన్ని, ఏ మాత్రం సహింపని చిత్తవృత్తి గలవారు వేమన. తాను చెప్పింది ఎదుటివారికి ఆహ్లాదంగాను, మనసుకు హత్తుకునేందుకు గాను తన పద్యాలలో వ్యంగ్యాన్ని, హాస్యాన్ని, చతురోక్తిని జోడించారు. కనుకనే వేమన పద్యాలు పండిత, పామర జనులకు యిష్టపద్యాలయ్యాయి. పెద్ద విషయాన్ని చిన్న సూక్తిలో లోకోక్తిగా చెప్పడంలో వేమనకు సాటిరాగల ఆంధ్రకవి నభూతో నభవిష్యతి.

వేదసారాంశమును వేదాంతసారమును తెలుగుపద్యాలలో తెలుగువారికందించిన మహానుభావుడు, పోలికలతో, దృష్టాంతములతో, ఉపమానములతో, సామెతలు, జాతీయముల నుడికారం చక్కగా రంగరించి తెలుగు వారికందించిన శేముషీధురంధరుడు వేమనార్యుడు. జ్ఞానము, ఆత్మజ్ఞానము, బ్రహ్మజ్ఞానము నంతటిని తన పద్యములలో చొప్పించిన మహానుభావుడు. వేమన ఎంత రక్తి కలవాడో చివరకు అంత విరక్తితో నిత్య సత్యములను సమాజమున కందించి, చైతన్యపరచిన సామాజిక న్యాయనిర్ణేత వేమనార్యుడు. వేమన కవిత్వము జాను తెలుగులో తేనెలూరించునట్లు ఉంటుంది. వేమన పద్యములలో స్వకీయానుభవము నిండి యుండి ప్రతిపద్యచమత్కారము కలిగియుంటుంది. వేమన గ్రహించిన సామాజికమును, సంఘసంస్కారము, వేరెవ్వరును అంతగా ఊహించలేరేమోయని తలంపుకలుగును. ఏదైనా ఒకవిషయమును విమర్శించాలంటే నిర్మోహమాటముగా చెప్పడము ఆయనకే చెల్లుతుంది. చక్కని జ్ఞానాత్మక బోధనలు, హాస్యరసము, సాంఘిక దురాచారములు ఎంతోలోతుగా ఆలోచించి పద్యరచన సాగించినాడు. ఆయన సంఘము మీద చేసిన విమర్శలు, సార్వకాలికములై జనామోదము కలిగినవైనాయి.

## ఆధార గ్రంథాలు

[1]. 5000 వేమన పద్యాలు - శ్రీ చిలుకూరి సత్య సుబ్రహ్మణ్య శాస్త్రి , రోహిణి పబ్లికేషన్స్, విజయవాడ - 2
[2]. సాక్షి ఈ - పేపర్ వ్యాసాలు
[3]. ఈనాడు ఎడిటోరియల్ వ్యాసం - వై. శ్రీ లక్ష్మి
[4]. పెద్ద బాలశిక్ష - గాజులు సత్యనారాయణ
[5]. వేమన శతకం - టీకా తాత్పర్య సహితము, రోహిణి పబ్లికేషన్స్